RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
బుధవారం । 19 । ఆగస్టు । 2026

# కాలేజీ తరలింపు కుట్రకు స్వస్తి చెప్పండి

**జిల్లా విద్యార్థులకు అన్యాయం చేస్తే ఉద్యమం తప్పదు**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వర్క అజిత్**

**కళాశాల తరలింపు నిలిపివేయాలని కలెక్టర్‌కు ఏఐఎస్ఎఫ్ వినతిపత్రం**



కొత్తగూడెం (తెలంగాణ వాణి)

జిల్లాకు మంజూరైన బీసీ సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్క అజిత్ డిమాండ్ చేశారు. గురుకుల డిగ్రీ కళాశాల తరలింపును అడ్డుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2023లో భద్రాద్రి జిల్లా కేంద్రానికి మంజూరైన బీసీ గురుకుల డిగ్రీ కళాశాలను నిబంధనలకు విరుద్ధంగా అన్నపురెడ్డిపల్లిలోని శిథిలావస్థకు చేరిన పాత సత్రం భవనంలో ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. ప్రస్తుతం కొందరు స్వార్థపూరిత శక్తులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ కళాశాలను మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు తరలించేందుకు తెరవెనుక కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే ప్రస్తుత విద్యాసంవత్సరం మొదటి సంవత్సరం ప్రవేశాలను ఉద్దేశపూర్వకంగా రద్దు చేస్తూ, ఉన్న విద్యార్థులకు టీసీలు ఇచ్చి పంపే యత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కొత్తగూడెం రామవరంలోని నేతాజీ పాఠశాలలో 500 మందికి సరిపడా విశాలమైన ప్రభుత్వ భవనం అందుబాటులో ఉందని, తక్షణమే అక్కడికి తరలించి రెగ్యులర్ తరగతులు నడపాలని కోరారు. జిల్లా విద్యార్థుల హక్కులను కాలరాస్తూ విద్యాసంస్థను తరలించాలని చూస్తే విద్యార్థి లోకం చూస్తూ ఊరుకోదని, తల్లిదండ్రులను కలుపుకుని జిల్లావ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించినవారిలో నాయకులు మర్మం ఉమా మహేష్, కళ్యాణ్ రాజేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అధికారుల నిర్బంధాలకు స్వస్తి పలకండి

**అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలి**

**డీఎంఎఫ్‌టీ నిధులు వివరాలు వెలడించాలి**

**ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను వెంటనే మంజూరు చేయాలి**

**మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ శాఖల సమన్వయంతో పైప్ లైన్ పనులు తురితగతిన పూర్తి చేయాలి**

**దిశ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

కొత్తగూడెం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి)




నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఇళ్లకు నంబర్లు ఇవ్వకుండా అటవీ అధికారులు అడ్డుకోవడం సరికాదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఐడిఓసి లో నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురిచేసే చర్యలను నిలిపివేయాలని, పెండింగ్ పోడు భూముల పట్టాలు ఇవ్వాలని కోరారు. వైద్య విధాన పరిషత్, డీఎంహెచ్ఓ, డీఎంఈ విభాగాల మధ్య సమన్వయ లోపంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గత రెండున్నరేళ్లలో కొత్తగూడెం నియోజకవర్గానికి కేటాయించిన డీఎంఎఫ్‌టీ నిధుల వివరాలను వెల్లడించాలని ఆయన దిశా సమావేశంలో కోరారు. యాప్ సహకరించడం లేదని సాకుతో నిలిపివేసిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, ఇళ్లు నిర్మించుకునే పేదలకు అధికారులు సహకరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారంలో దిశా కమిటీ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు ప్రకటించింది. దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ పి. బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఐటీడీఏ పీవో రాహుల్, కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్‌డీఓ విద్యా చందన, మున్సిపల్ చైర్‌పర్సన్లు, దిశా కమిటీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాపర్టీ, దొంగతనం కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

**- పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

కొత్తగూడెం, ఆగస్టు, 18 (తెలంగాణ వాణి)

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అధికారులు, సిబ్బందితో స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ప్రాపర్టీ కేసులు, దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి, చోరీకి గురైన ఆస్తి రికవరీ దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలను వినియోగించే వారిని గుర్తించి వారికి డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ సంబంధిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్‌తో పాటు నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్-112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా



స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్.సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, సాయి కిషోర్ రెడ్డి, విజయ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాల్వంచ చెరువుల కబ్జాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**- జిల్లా యంత్రాంగానికి బీజేపీ నేత భూక్య రవి నాయక్ విజ్ఞప్తి**

కొత్తగూడెం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి)



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ ప్రాంతంలోని పలు చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్య రవి నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ మరియు భూగర్భ జలాల సంరక్షణ దృష్ట్యా జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కబ్జాలకు గురవుతున్నట్లు గుర్తించిన చెరువుల వివరాలను ఆయన వెల్లడించారు. నెహ్రూ నగర్ చెరువు సర్వే నెం. 816, 37 ఎకరాలు, మేడికుంట చెరువు సర్వే నెం. 656, 4.5 ఎకరాలు, జోగారావు చెరువు సర్వే నెం. 358, 35 ఎకరాలు, ఎర్రకుంట చెరువు సర్వే నెం. 358/405, 15 ఎకరాలు, చింతల చెరువు సర్వే నెం. 70, 97 ఎకరాలు, భూతేర చెరువు 15 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ ఈ చెరువులపై సమగ్ర సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ కబ్జాలను తక్షణమే తొలగించి ప్రభుత్వ భూములు, చెరువులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. చెరువులను కాపాడండి భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించండి అని భూక్య రవి నాయక్ పిలుపునిచ్చారు.

# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయొద్దు

**ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొడతాం**

**ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా సహాయ కార్యదర్శి వినయ్**

కొత్తగూడెం (తెలంగాణ వాణి)

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడటం తగదని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ ధ్వజమెత్తారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేయడాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీ ముసుగులో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల ఆస్తులను ప్రైవేటీకరించడం పూర్తిగా అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్ష రాసే అర్హత కోల్పోయి, కార్పొరేట్ కంపెనీల్లో తక్కువ వేతనాలకే పనిచేసే పరిస్థితులు దాపురిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్లొమా విద్యార్థులకు ఎంతో కాలంగా అమల్లో ఉన్న లాటరల్ ఎంట్రీ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 1957 నుంచి ఎంతో మంది సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దిన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యారంగాన్ని దెబ్బతీసే చర్యలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పాలిటెక్నిక్ కమిటీ సభ్యులు సలిగంటి జయదీప్, రామ్ చరణ్, సాయి రామ్, వడ్డేబోయిన యశ్వంత్, ముదిగొండ నిరీక్షణ, సన్నీ, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.



# చలో హైదరాబాద్ మహా ధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరణ




లక్ష్మీదేవిపల్లి (తెలంగాణ వాణి)

టీఎస్ సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో జరగబోయే చలో హైదరాబాద్ మహా ధర్నా కార్యక్రమ వాల్ పోస్టర్‌ను లక్ష్మీదేవిపల్లి మండలంలో మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల తహసీల్దార్ శిరీష, పీఆర్‌టీయూ టీజీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బి.రవి హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి. రవి మాట్లాడుతూ సి పీ ఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్ సీపీఎస్ ఈయూ మహా ధర్నాను విజయవంతం చేయడానికి పీ ఆర్ టీ యూ టీజీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రసాద్, ఐటిడిఏ ప్రతినిధి హీరాలాల్, ఆర్ ఐ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# చుంచుపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

**108 సిబ్బంది సమయస్ఫూర్తితో తప్పిన ప్రాణనష్టం**

చుంచుపల్లి (తెలంగాణ వాణి)



చుంచుపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 108 అత్యవసర వైద్య సేవల సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒకరి ప్రాణాన్ని కాపాడారు. బాధితుడు చుంచుపల్లి నివాసి అయిన అజ్మీర మోహన్ రాత్రి 9:41 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా చుంచుపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రమైన గాయం కావడంతో అధిక రక్తం స్రావమై పరిస్థితి విషమంగా మారింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. కాలింగ్ అందిన వెంటనే 108 వాహన ఈఎంటీ స్రవంతి, పైలట్ సాంబశివరావు సంఘటనా స్థలానికి వేగంగా చేరుకున్నారు. తీవ్ర గాయాలతో ఉన్న మోహన్‌కు ప్రాథమిక చికిత్స అందించి రక్తాన్ని అదుపు చేశారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బాధితుడిని కొత్తగూడెం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి సురక్షితంగా తరలించారు. సమయానికి స్పందించి ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాపాయం తప్పించిన 108 ఈఎంటీ స్రవంతి, పైలట్ సాంబశివరావుల సేవలను స్థానికులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

# జర్నలిస్ట్ వాసాల కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ ఆర్ఆర్ఆర్



కొత్తగూడెం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి)

కొత్తగూడెం ప్రముఖ దినపత్రిక ఇంచార్జ్ వాసాల చంద్రశేఖర్ మాతృమూర్తి వాసాల పోచమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామ సహాయం రఘురామిరెడ్డి కొత్తగూడెం హనుమాన్ బస్తీలోని వారి స్వగృహానికి వెళ్లి పోచమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, పీసీసీ సభ్యులు నాగ సీతారాములు, పార్టీ నాయకులు వూకంటి గోపాలరావు, చీకటి కార్తీక్ తదితరులు నివాళులర్పించారు.



టీజేఎఫ్ నాయకులు, పాత్రికేయుల నివాళి

పోచమ్మ మృతికి సంతాపం తెలిపిన టీజేఎఫ్ నాయకులు, పాత్రికేయులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్, మహమ్మద్ షఫీ, సాక్షి జిల్లా బ్యూరో తాండ్ర కృష్ణగోవింద్, డి. వెంకటేశ్వరరావు, కే. వెంకటేశ్వర్లు, ప్రవీణ్, బబ్లు, అశోక్, రాజేందర్, తాండ్ర రాజకుమార్, శ్రీనివాస్, రామకృష్ణ, తారక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# గౌతమ్‌పూర్‌లో బీఎల్‌ఓలకు ఘన సన్మానం

చుంచుపల్లి (తెలంగాణ వాణి)

గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీ ప్రాంగణంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ)లను సర్పంచ్ సపావత్ కళ్యాణి, ఉప సర్పంచ్ గంగారం, పంచాయతీ కార్యదర్శి షర్మిల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో బీఎల్‌ఓల సేవలు అభినందనీయమన్నారు. అర్హులైన పౌరుల ఓట్లు తొలగిపోకుండా అప్రమత్తంగా పనిచేసి సవరణ ప్రక్రియను విజయవంతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పద్మ, ఈశ్వరి, శివలీల, మస్తాన్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన మంత్రి వివేక్

కొత్తగూడెం (తెలంగాణ వాణి)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శక కేంద్రాలని, అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న చైర్మన్ పసుపులేటి వీరబాబును అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలపై దృష్టి: కలెక్టర్



ఖమ్మం, సింగరేణి/ ఆగస్టు 18 (తెలంగాణ వాణి):

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్ ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. మంగళవారం కారేపల్లి మండలం రేలకాయపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతి, ఆసక్తులు, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. పాఠశాలలోని లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, మ్యూజిక్ రూమ్, ఆర్ట్స్ గ్యాలరీలను పరిశీలించి విద్యార్థుల సృజనాత్మకతను అభినం దించారు. కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల భద్రత, నాణ్యమైన భోజనం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పాఠశాలకు రవాణా, రహదారి, సోలార్ విద్యుత్ కంచె, అదనపు లైట్లకు సంబంధించిన ప్రతి పాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# కార్మికుల సమస్యలపై సివిల్ ఏజీఎంతో ఐఎన్టీయూసీ నేతల చర్చ

**సమస్యల పరిష్కారానికి హామీ**




కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి)

కొత్తగూడెం ఏరియా సివిల్ ఏజీఎం ను ఐఎన్ టీయూసీ నాయకులు మంగళవారం కలిశారు. ఐఎన్ టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, సివిల్ డిపార్ట్‌మెంట్ ఏరియా ఫిట్ సెక్రటరీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో సివిల్ డిపార్ట్‌మెంట్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమగ్రంగా చర్చించారు. కార్మికుల సమస్యలకు సంబంధించిన మెమోరాండం ఏజీఎం కు అందజేశారు. కార్మికుల సమస్యలపై ఏజీఎం సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

RNI NO: APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
బుధవారం । 19 । ఆగస్టు । 2026

## నిరుపయోగంగా ఉన్న వైకుంఠ రథాన్ని వినియోగంలోకి తీసుకురావాలి




**జమ్మికుంట , ఆగస్టు, 18,(తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎంపీడీఓ కార్యాలయం పక్కన కొన్ని సంవత్సరాలుగా వైకుంఠ రథాన్ని నిరుపయోగంగా ఉంచడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో ప్రజలకు ఉపయోగపడాల్సిన వైకుంఠ రథాన్ని ఇంతకాలం పక్కన పెట్టడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ 3వ వార్డు సభ్యులు, హుజురాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన నాయకులు బండారి ప్రశాంత్ మాట్లాడుతూ.. వైకుంఠ రథాన్ని అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అంత్యక్రియల సమయంలో వైకుంఠ రథం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన వాహనాన్ని నిరుపయోగంగా ఉంచకుండా తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.సంబంధిత అధికారులు స్పందించి వైకుంఠ రథానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రజా సేవకు అందుబాటులోకి తీసుకురావాలని బండారి ప్రశాంత్ విజ్ఞప్తి చేశారు.

## అవసరాల ఆధారిత కనీస వేతనాల కోసం పోరాడుదాం: టీయూసీఐ




**తల్లాడ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
అవసరాల ఆధారిత కనీస వేతనాల సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఆగస్టు 20న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం తల్లాడ మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (1957) సిఫార్సులు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం కార్మికుడు, అతని కుటుంబం గౌరవప్రదంగా జీవించేందుకు సరిపడేలా ఉండాలని అన్నారు.ఆహారం, దుస్తులు, నివాసం, విద్య, వైద్యం, ఇంధనం తదితర అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ధరలకు అనుగుణంగా కార్మిక కుటుంబానికి నెలకు రూ.39,373 కనీస వేతనం ఉండాలని తెలిపారు. ద్రవ్యోల్బణం నుంచి రక్షణ కల్పించేలా వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్ (వీడీఏ)ను అమలు చేయాలని కోరారు. చట్టబద్ధమైన కనీస వేతనం చెల్లించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 20న ఖమ్మంలో జరిగే ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్‌మియా, తల్లాడ బ్రాంచ్ నాయకులు పఠాన్ నాగులమీరా, డి. రమణ, గార్లపాటి నాగేశ్వరరావు, నారాయణ, రామకృష్ణ, మైసరావు, రాఘవ, సత్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను జయప్రదం చేయండి: టీయూసీఐ



**టేకులపల్లి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
గౌరవప్రదమైన వేతనాల కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న పిలుపునిచ్చారు. ఈనెల 20న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.మంగళవారం టేకులపల్లి లారీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 20న జరిగే ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వెంకన్న కోరారు. జనరల్ బాడీలో రామ్ కోటి, కుంజ కోటేష్, అరేం మధు, మోకాళ్ళ సందీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు నోట్‌బుక్స్, క్రీడా పరికరాల పంపిణీ

**టేకులపల్లి:తెలంగాణవాణి,ఆగస్టు18**



చేయూత కార్యక్రమం లో భాగంగా మంగళవారం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామం కొత్తతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ, క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఎన్ఆర్ఐ తూనుగుంట్ల శిరీష సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం బాలు నాయక్, బొమ్మనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా, కొత్తతండా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, కొత్తగూడెం పట్టణ ప్రముఖులు లగడపాటి రమేష్ చంద్, మిట్టపల్లి పాండు రంగారావు, పల్లపోతు సాయిబాబా, కొల్లా నరసింహారావు, మిట్టపల్లి మురళి, కొత్త తండా సర్పంచ్ తారాచంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జ్ఞాపకాలకు జీవం పోసే అఖిల్ ఫోటోగ్రఫీ

**పెద్దపల్లి: ఆగస్టు,18 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
మనిషి జీవితంలో గడిచిపోయే ప్రతి క్షణం తిరిగి రాదు. అయితే ఆ క్షణాలను పదిలంగా నిలిపేది మాత్రం ఒక ఫొటో. సంతోషం, సంబరం, అనుబంధం, ప్రకృతి అందం, సామాజిక జీవన విధానం.. ఇలా ప్రతి అనుభూతికి ఫొటోగ్రఫీ ఓ అందమైన జ్ఞాపకంగా నిలుస్తుంది. మాటలు కాలక్రమంలో మరచిపోయినా.. ఒక ఫొటో మాత్రం గతాన్ని కళ్లముందు నిలబెట్టి మధుర జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేస్తుంది.ఫొటోగ్రఫీకి ఉన్న ఈ ప్రత్యేకతను గుర్తు చేసుకునే రోజే అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం. ప్రతి ఏటా ఆగస్టు 19న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన యువ ఫొటోగ్రాఫర్ గుర్రం అఖిల్ ఫొటోగ్రఫీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటున్నారు.సుల్తానాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి అందాలు, ప్రజల జీవన విధానం, పండుగలు, సామాజిక కార్యక్రమాలు, ప్రత్యేక సందర్భాలను తన కెమెరాలో బంధిస్తూ అఖిల్ ఫొటోగ్రఫీపై ఉన్న ఆసక్తిని చాటుకుంటున్నారు. సాధారణంగా కనిపించే దృశ్యాల్లోనూ ప్రత్యేకతను గుర్తించి, సరైన సమయంలో సరైన కోణంలో చిత్రీకరించడం ఆయన ఫొటోగ్రఫీకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.ఒక మంచి ఫొటో కేవలం ఓ చిత్రం మాత్రమే కాదని, అది ఓ కథను చెబుతుందని అఖిల్ అభిప్రాయపడుతున్నారు. మన కళ్ల ముందు కదిలిపోయిన ఎన్నో దృశ్యాలను కెమెరా ఒక్క క్లిక్‌తో శాశ్వత జ్ఞాపకంగా మార్చగలదని చెబుతున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు మొదలు



కుని కుటుంబ వేడుకలు, స్నేహితులతో గడిపిన క్షణాలు, ప్రకృతి దృశ్యాలు, సామాజిక సంఘటనల వరకు ఫొటోలు మన జీవితంలో చెరగని ముద్ర వేస్తాయని పేర్కొంటున్నారు. ఫొటోగ్రఫీ చరిత్రను పరిశీలిస్తే.. 1826లో ఫ్రాన్స్‌కు చెందిన జోసెఫ్ నైసిఫోర్ నీప్స్ తొలి ఛాయాచిత్రాన్ని రూపొందించినట్లు చరిత్ర చెబుతోంది. అనంతరం లూయిస్ జే.ఎం. డాగ్యూరే అభివృద్ధి చేసిన డాగ్యూరియోటైప్ విధానం ఫొటోగ్రఫీకి మరింత ప్రాచుర్యం తీసుకొచ్చింది. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం ఈ విధానానికి సంబంధించిన హక్కులను స్వీకరించి ప్రపంచానికి అందుబాటులోకి తీసుకురావడంతో ఆ రోజును అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవంగా గుర్తిస్తున్నారు.ఒకప్పుడు పెద్ద పరిమాణంలో ఉండే కెమెరాలు, రీల్స్, ఫిల్మ్‌లతో ఫొటోలు తీసే పరిస్థితి ఉండేది. ఒక్క ఫొటో కోసం ఎంతో సమయం, ఖర్చు అవసరమయ్యేది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ఫిల్మ్ కెమెరాల స్థానంలో డిజిటల్ కెమెరాలు, ఆ తర్వాత స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం చిన్న మెమోరీ కార్డులోనే వందలాది, వేలాది చిత్రాలను భద్రపరచుకునే స్థాయికి ఫొటోగ్రఫీ చేరుకుంది.అయితే సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా.. ఫొటోగ్రాఫర్ దృష్టి, సృజనాత్మకత, సమయస్ఫూర్తి, సరైన క్షణాన్ని గుర్తించే నైపుణ్యమే మంచి ఫొటోకు అసలు ప్రాణమని అఖిల్ చెబుతున్నారు. ఒక క్షణాన్ని అందంగా బంధించడం మాత్రమే కాకుండా.. ఆ ఫొటోను చూసిన ప్రతి ఒక్కరిలోనూ ఓ అనుభూతిని కలిగించడమే నిజమైన ఫొటోగ్రఫీ లక్ష్యమని ఆయన పేర్కొంటున్నారు.సుల్తానాబాద్ ప్రాంతానికి చెందిన యువతలో ఫొటోగ్రఫీపై ఆసక్తి పెరగడం, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో ఫొటోగ్రఫీ రంగంలో మరింతగా రాణించి సుల్తానాబాద్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అఖిల్‌ను పలువురు అభినందిస్తున్నారు.కాలం కరిగిపోతుంది.. జ్ఞాపకాలు మసకబారుతాయి.. కానీ ఒక అందమైన ఫొటో మాత్రం గతాన్ని మళ్లీ మన కళ్లముందుకు తీసుకొస్తుంది. అందుకే ఫొటోగ్రఫీ కేవలం కెమెరాతో చిత్రాన్ని తీయడం కాదు కాలాన్ని జ్ఞాపకంగా భద్రపరిచే కళ.

## కెమెరాతో చరిత్రను బంధిస్తున్న జక్కుల రాజు

**- అరుదైన ఫోటోగ్రఫీ, డాక్యుమెంటేషన్‌తో ప్రత్యేక గుర్తింపు**

**మంచిర్యాల,ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
ఫోటోగ్రఫీ రంగంలో 28 సంవత్సరాలకు పైగా సేవలం దిస్తూ, అరుదైన దృశ్యాలను తన కెమెరాలో బంధిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు మంచిర్యాల పట్టణానికి చెందిన ఉమా యాడ్స్ నిర్వాహకుడు జక్కుల రాజు. ఫోటోగ్రఫీని వృత్తిగా మాత్రమే కాకుండా ఒక కళగా భావిస్తూ అంకిత భావంతో పనిచేస్తున్న ఆయన పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు సంబంధించిన పలు కార్యక్రమాలకు ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ సేవలు అందిస్తున్నారు.గాంధారి ఖిల్లా చారిత్రక ప్రదేశంపై రాజు రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటేషన్‌కు పలువురు అధికారులు, కలెక్టర్ల నుంచి ప్రశంసలు లభించాయి. ఉట్నూర్ ఇన్‌చార్జి పీఓ వరుణ్‌రెడ్డి తదితర అధికారులు ఆయనను సత్కరించారు. అలాగే 'పోలీస్ మీకోసం' కార్యక్రమంపై రూపొందించిన డాక్యుమెంటేషన్‌ను పరిశీలించిన ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ రాజు ప్రతిభను అభినందించారు.మేడారం సమ్మక్కసారలమ్మ జాతర వైభవాన్ని తన కెమెరాలో అద్భుతంగా బంధించి డాక్యుమెంటేషన్ చేసిన రాజు రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీలో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లోనూ అవార్డులు అందుకున్నారు. 2017లో అప్పటి మంచిర్యాల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా ప్రశంసా పత్రం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చేసిన డాక్యుమెంటేషన్‌కు కూడా అధికారులు అభినందించి సన్మానించారు.సార్వత్రిక ఎన్నికల్లో ఐదుసార్లు ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ సేవలు అందించి రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు.




అధికారిక కార్యక్రమాలను భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా డాక్యుమెంటేషన్ చేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. తన వద్దకు వచ్చే పలువురు యువతకు ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీలో మెళకువలు నేర్పిస్తూ వారికి మార్గదర్శిగా నిలుస్తున్నారు.అందరితో కలివిడిగా, స్నేహపూర్వకంగా మెలిగే జక్కుల రాజు ఫోటోగ్రఫీ రంగంలో తనదైన శైలితో ముందుకు సాగుతున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల ఆర్డీఓ వొడ్నాల రాములు చేతుల మీదుగా ఉత్తమ ఫోటోగ్రాఫర్ ప్రశంసా పత్రం అందుకోవడం ఆయన సేవలకు మరో గుర్తింపుగా నిలిచింది. మరిన్ని అరుదైన డాక్యుమెంటేషన్లతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలనే లక్ష్యంతో రాజు నిరంతరం కృషి చేస్తున్నారు.

## కళ్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించాలి: పుట్ట మధూకర్



**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. పథకాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు.మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కళ్యాణలక్ష్మిపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం మంథనిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాజగృహ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి, మహిళలు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలుపై మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిపై కేసులు పెట్టడం కాకుండా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.

**ఆడబిడ్డల ఆత్మగౌరవమే కళ్యాణలక్ష్మి**



కళ్యాణలక్ష్మి పథకంపేదింటిఆడబిడ్డలకుఆర్థికభరోసా కల్పిస్తోందని జడ్పీమాజీచైర్‌పర్సన్ జక్కుశ్రీహర్షిణీరాకేష్ అన్నారు. పథకాన్ని కొనసాగించే వరకు మహిళా లోకం పోరాటం చేస్తుందని తెలిపారు. పథకంపై కోర్టులో కేసు ఉన్నప్పటికీ ప్రభుత్వంసరైనవిధంగాస్పందించలేదనివిమర్శించారు.

**పథకాలను రద్దు చేసే కుట్రలను అడ్డుకోవాలి**

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి పథకాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలిపింది కేసీఆర్: నిరంజన్‌రెడ్డి




**వనపర్తి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిలిపివేసే కుట్ర చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కుట్రలకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వనపర్తి రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన 'కదనభేరి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.కేసీఆర్ హయాంలో పేద ఆడబిడ్డల ఆర్థిక భరోసా, ఆత్మగౌరవం కోసం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేశారని తెలిపారు. తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని అమలు చేయకుండా పథకాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. పథకాలను కొనసాగించడంతో పాటు కేసీఆర్ కిట్, రైతుబీమా పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అలాగే ఆసరా పింఛన్లు, మహిళలకు రూ.2,500 వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉందని, బీఆర్ఎస్ నిరసనలకు అనుమతులు నిరాకరించడం సరికాదన్నారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




## సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతి



**వనపర్తి : ఆగస్టు 18, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి మండలం రాజపేట గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతి సందర్భంగా మంగళవారం గ్రామంలో ఘనంగా జరుపుకున్న గౌడ సంఘం నాయకులు గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు అంజనేయులు గౌడ్,మాజీ సర్పంచ్ పి బాలరాజు గౌడ్, వనపర్తి మండల అధ్యక్షుడు తిరుపతయ్య గౌడ్, ఉపాధ్యక్షులు శరత్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ గౌడ్,సలహాదారు సూర్యం గౌడ్, రాములు గౌడ్,గంగాధర్ గౌడ్,మోహన్ గౌడ్, రాజ గౌడ్, జలంధర్ గౌడ్, మహేందర్ గౌడ్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ




**తల్లాడ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అయినాల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికులను అక్రమంగా తొలగించే సర్పంచులపై చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. వేతనాలను ప్రతి నెలా నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు గ్రామపంచాయతీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చల్లా నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్, ఎస్.కె. చాంద్ పాషా, తాళ్లూరి వేలాద్రి, దారెల్లి బాబు, ముచ్చింతల ఎల్లారావు, నరికంటి ప్రసన్నకుమార్, బానోతు శంకర్, మల్లిక, సుజాత, లక్ష్మి, సునీత, సురేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. గణేష్**




**టేకులపల్లి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
పాలిటెక్నిక్ విద్యను శక్తి (స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్)లో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని పి.డి.ఎస్.యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జె. గణేష్ డిమాండ్ చేశారు.మంగళవారం టేకులపల్లి మండల పి.డి.ఎస్.యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం చేయడం వల్ల విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాలు దెబ్బతింటాయని అన్నారు. పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా ఉన్నత విద్యా మండలి పరిధిలో కొనసాగించాలని, లేనిపక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వరి, ఉష, దీపిక, లోకేష్ భర్గవ్ తదితరులు పాల్గొన్నారు

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
బుధవారం । 19 । ఆగస్టు । 2026

## గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి

**అశ్వారావుపేట, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**





గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు నిర్వహించిన రెండు రోజుల రిలే దీక్షల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, రెండో పీఆర్సీ వర్తింపజేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామపంచాయతీ కార్మికుల జిల్లా అధ్యక్షుడు యాదగిరి వెంకటప్పయ్య, అశ్వారావుపేట సీఐటీయూ మండల కన్వీనర్ కేసుపాక నరసింహారావు, మండల కమిటీ సభ్యులు చందా రామారావు, మండల కోశాధికారి వేల్పుల ముత్తారావు, రాఘవ, భద్రం, విజయ్, మల్లయ్య, ఆదాం, నాగేశ్వరరావు, రాముడు, మడివి తిరుపతిరావు, భూక్య ప్రసాద్, సీనియర్ నాయకులు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**తల్లాడ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మిరెడ్డి, సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎం. ప్రసాద్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, రైతులకు బోనస్, సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు, నిరసనలు చేయడం సరికాదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎం. ప్రసాద్, మాజీ ఎంపిటిసి తాళ్ల జోసెఫ్, మంగాపురం ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోడూరు రాము, గొడుగునూరు శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణ రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, గొడుగునూరి అబ్రహం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు సర్దార్ పాపన్న గౌడ్..

**తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు..**

**పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా తల్లాడలో ర్యాలీ**



**తల్లాడ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి) :**

సమాజంలో బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు(చిన్నబ్బాయి) అన్నారు. సర్దార్ పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తల్లాడలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రింగ్ రోడ్డు సెంటర్లో పాపన్న గౌడ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గౌడ సంఘం మండల అధ్యక్షులు గుండ్ల నాగయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక వర్గాల కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం నాయకులు మొక్కా తిరుపతిరావు, సమ్మె రామకృష్ణ, గుండ్ల వెంకటేశ్వర్లు, బొడ్డు సత్యం, రావుల గోపి గౌడ్, బొడ్డు నాగేశ్వరరావు, మొక్క కృష్ణార్జున్, మొక్క సత్యనారాయణ, నాసగోని సురేష్, మొక్క కృష్ణ, రాము, మల్లయ్య, పెరిక అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మొక్కలు నాటిన ఉపాధ్యాయులు



**కన్నాయిగూడెం,ఆగస్టు18(తెలంగాణ వాణి):**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని చింతగూడెం గ్రామంలో పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు అందరు కలిసి మొక్కలు నాటారు గ్రామ ఉప సర్పంచ్ దుర్గం అనిత కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ కోఆర్డినేటర్ దుర్గం ప్రభాకర్ ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన ప్రకృతికి గాలి శుద్ధి కావడం భూమి కోత తగ్గి గాలిలోని హానికరమైన కార్బన్ డై ఆక్సైడ్ ను పీల్చుకొని పిల్లలకు మంచి ఆరోగ్యమైన వాతావరణం వస్తుంది అని అన్నారు వారితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సతీష్,నర్సింహా పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత

### విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలు వేదికలుగా నిలవాలి

### కలెక్టర్ దివాకర టీఎస్





**ఖమ్మం, ఏదులాపురం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలు వేదికలుగా నిలవాలని, విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్, విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ దివాకర టీఎస్ అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పోలేపల్లి శిరిడీ సాయినాథ్ నగర్‌లో ఉన్న ఖమ్మం పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాలు, పరీక్షా ఫలితాలు, ప్రవేశాలు, సహపాఠ్య కార్యక్రమాలు, పీఎం శ్రీ కార్యక్రమాల అమలు, డిజిటల్ విద్య, మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను నిరంతరం అంచనా వేస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 202627 విద్యా సంవత్సరంలో మొత్తం 256 మంది విద్యార్థులకు కొత్తగా ప్రవేశాలు కల్పించినట్లు అధికారులు వివరించారు. పాఠశాలలో 55 కంప్యూటర్లు, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్, వై-ఫై, 25 ఈ-క్లాస్ రూమ్‌లు, ఇంటరాక్టివ్ బోర్డులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిజిటల్ వనరులను సమర్థంగా వినియోగించి బోధనను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచాలని ఆదేశించారు. చెట్ల కొమ్మల తొలగింపు, పాముల సంచారం నివారణ, కోతుల బెడద నియంత్రణ, అప్రోచ్ రోడ్డు భద్రతకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలు, సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్స్ జి. విజయలక్ష్మి, వెంకటరమణ, డీవైఎస్వో టి. సునీల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, డి. నవీన్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ ఎం. మహేందర్‌రెడ్డి, పేరెంట్స్ మెంబర్ ఎం. అనిత, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి షాదీముబారక్ పథకాలను కొనసాగించాలి



**తల్లాడ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**

కల్యాణలక్ష్మిషాదీముబారక్ పథకాలను కొనసాగించి, పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తల్లాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు భారీ నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందనే కారణంతో పేదల సంక్షేమాన్ని నిలిపివేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే కౌంటర్ దాఖలు చేసి న్యాయపరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు, రెడ్డెం వీర మోహన్ రెడ్డి, తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, మండల పార్టీ కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్ , తల్లాడ మాజీ జడ్పీటీసీ దిరిశాల ప్రమీల, తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మిరెడ్డి , తల్లాడ టౌన్ అధ్యక్షులు జీవిఆర్ , జోనల్ లు చైర్మన్ దగ్గుల శ్రీనివాస్ రెడ్డి, దిరిశాల దాసురావు , కుర్నవల్లి బి ఆర్ ఎస్ నాయకులు అయిలూరి శివారెడ్డి ఇంజం కృష్ణార్జున రావు, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, గొల్లగూడెం బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోడూరు వీరకృష్ణ , లక్ష్మీపురం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శీలం ముత్తారెడ్డి , తల్లాడ ఉప సర్పంచ్ గుడ్ల వెంకట్ , నూతనకల్మాజీ సర్పంచ్ శెట్టిపల్లి లక్ష్మణరావు, అంబేత్కర్ నగర్ ఉప సర్పంచ్ జొన్నలగడ్డ కిరణ్ ,తల్లాడ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గుడ్ల నాగయ్య గారు, తెల్లూరు రఘు , రేగళ్ల సత్యం , గోపాల పేట బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు , బి ఆర్ ఎస్ పార్టీ తల్లాడ యువజన విభాగం అధ్యక్షులు శీలం శ్రీనివాసరెడ్డి (ఎస్ ఎస్ రెడ్డి) టౌన్ ఉపాధ్యక్షులు సంగసాని శ్రీను, పమ్మి కృష్ణారావు, గొల్లమందల సురేష్, కుర్నవల్లి నాయకులు ఎక్కిరాల పాపులు , మరియు గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్య విస్తృత పర్యటన



**టేకులపల్లి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం టేకులపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతులు, విద్యా బోధన, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం మొక్కంపాడు, ఆర్సీ పేట, లచ్చగూడెం, శంభునిగూడెం, చింతోనిచిలక తదితర గ్రామాల్లో డ్రైనేజీలు, కల్వర్టులు, రోడ్డు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నారి కావ్యను పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శం : ఎమ్మెల్యే జారె






**అశ్వారావుపేట, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట రింగ్‌రోడ్ సెంటర్‌లో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మంగళవారం ఆవిష్కరించారు. సినీ హీరో సుమన్ గౌడ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు మౌనం వహించకుండా పోరాడిన పాపన్న గౌడ్ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవసరాల ఆధారిత కనీస వేతనాల కోసం పోరాడాలి: టీయూసీఐ



**తల్లాడ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**

అవసరాల ఆధారిత కనీస వేతనాల సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈనెల 20న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ తల్లాడలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు గౌరవప్రదమైన జీవనం సాగించే స్థాయిలో కనీస వేతనాలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు శాస్త్రీయ ప్రాతిపదికన వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 20న జరిగే ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్‌మియా, తల్లాడ బ్రాంచ్ నాయకులు పఠాన్ నాగుల మీరా, డి. రమణ, గార్లపాటి నాగేశ్వరరావు, నారాయణ, రామకృష్ణ, మైసరావు, రాఘవ, సత్యం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నార్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ రవీందర్



**ములుగు, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**

తాడ్వాయి మండలంలోని నార్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను ములుగు డీఎస్పీ రవీందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరగా న్యాయం అందించాలని సిబ్బందికి సూచించారు. రౌడీ, కేడీ వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని, యువత, విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి 5ఎస్ విధానం పాటించాలని తెలిపారు. 'నేను సైతం' కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించారు. ప్రతి గ్రామంలో ప్రజలు తమ వంతు బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

## దాట్ల వెంకట సీతారామరాజుకు ఘన నివాళి



**చర్ల, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**

సత్యనారాయణపురం పీఏసీఎస్ స్థలదాత, వ్యవస్థాపకుడు స్వర్గీయ దాట్ల వెంకట సీతారామరాజు పదో వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గా ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి, సహకార వ్యవస్థ బలోపేతానికి సీతారామరాజు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రైతుల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



## విగ్రహం తొలగింపు.. ప్రజాస్వామ్యానికి పరీక్ష !.. రాజకీయ కక్ష..!

నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని పోలీసులు, మున్సిపల్ అధికారులు తొలగించిన ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయ వేడిని పెంచింది. విగ్రహం తొలగింపునకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలకు దిగడం, పలువురు నాయకులను గృహ నిర్బంధం చేయడం, మరికొందరిని పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య వాతావరణంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజా స్థలాల్లో విగ్రహాల ఏర్పాటు విషయంలో నిబంధనలు,అనుమతులు కీలకమే. నిబంధనలు ఉల్లంఘించబడి ఉంటే అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. అయితే ఆ చర్యలకు ముందు సంబంధిత వర్గాలకు స్పష్టత ఇవ్వడం,నోటీసులు జారీ చేయడం, వివాదానికి చర్చల ద్వారా పరిష్కారం చూపడం ప్రజాస్వామ్య పరిపాలనకు మరింత సముచితం. ఒకవైపు విగ్రహం తొలగింపు.. మరోవైపు నిరసనలకు దిగిన నాయకులపై నిర్బంధాలు, అరెస్టులు చోటుచేసుకోవడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చే ప్రమాదం ఉంది. పోలీసుల ప్రధాన బాధ్యత శాంతిభద్రతలను కాపాడటమే. రాజకీయ విభేదాల నేపథ్యంలో పోలీసు చర్యలు ప్రతీకార చర్యలుగా కనిపించకుండా వ్యవహరించడం అత్యంత అవసరం. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి జన్మదినం సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడాన్ని నియోజకవర్గ ప్రజలు, సామాజికవేత్తలు,నాయకులు తప్పుపడుతున్నారు. అదే సమయంలో ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కూడా తమ నిరసనలను శాంతియుతంగా, చట్టబద్ధంగా నిర్వహించాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కే అయినప్పటికీ ప్రజలకు ఇబ్బంది కలిగించే లేదా ఉద్రిక్తతలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలి. విగ్రహం ఒక వ్యక్తికి సంబంధించిన గుర్తు మాత్రమే కాదు. ఆయనను అభిమానించే ప్రజల భావోద్వేగాలకు ప్రతీక.



అందుకే ఇలాంటి అంశాలను రాజకీయ ఆధిపత్య ప్రదర్శనగా మార్చకుండా, అన్ని వర్గాలతో చర్చించి పరిష్కరించడం అవసరం. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. రాజకీయ రంగు పులుముకోకూడదు. ప్రభుత్వం ఈ వివాదంపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి. బీఆర్ఎస్ నాయకులతో చర్చించి సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం చూపాలి. విగ్రహాన్ని తొలగించడం కంటే వివాదానికి పరిష్కారం చూపడమే పాలనలో అసలైన విజయం. ప్రజాస్వామ్యంలో విగ్రహాల కంటే ప్రజల విశ్వాసాన్ని కాపాడటం ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు మరింత ముఖ్యమైన బాధ్యత.

డా. మోటె చిరంజీవి, సామాజికవేత్త,విశ్లేషకులు
సెల్ : 9949194327

# పల్లెల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు

### మద్యం మత్తులో గ్రామీణ యువత..

### పట్టించుకోని అధికారులు?





**కన్నాయిగూడెం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):** కన్నాయిగూడెం మండలంలోని పలు గ్రామాలు, గూడాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో గ్రామంలో పది నుంచి ఇరవై వరకు బెల్టు షాపులు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బెల్టు షాపుల కారణంగా యువత మద్యానికి బానిసవుతూ కుటుంబాల్లో కలహాలు, గ్రామాల్లో ఘర్షణలు పెరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం సీసాలపై అధిక ధరలు వసూలు చేస్తున్నప్పటికీ నియంత్రణ చర్యలు కనిపించడం లేదని పేర్కొంటున్నారు.

**అధికారుల స్పందనపై ఆరోపణలు**

బెల్టు షాపులపై ఫిర్యాదు చేసేందుకు ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసినా స్పందన ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

**వైన్ షాపుల్లో కంటే బెల్టు షాపుల్లోనే బ్రాండ్లు?**

లైసెన్సు కలిగిన మద్యం దుకాణాల్లో అం దుబాటులో లేని కొన్ని బ్రాండ్లు బెల్టు షాపుల్లో లభిస్తున్నాయని మద్యం వినియోగదారులు చెబుతున్నారు. వైన్ షాపుల నుంచి గ్రామాల్లోని బెల్టు షాపులకు మద్యం సరఫరా జరుగుతోందనే ఆరోపణలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బెల్టు షాపులపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కన్నాయిగూడెం మండల ప్రజలు కోరుతున్నారు.